కర్నూలు | నంద్యాల
వార్త
7 ఆగస్టు , 2023 సోమవారం పేజీలు 4

# టీడీపీ ఉనికి కోసమే.. బాబు పర్యటనలు

**- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**

**బనగానపల్లె, ఆగస్టు6, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల నుండి కనుమరుగైపోతుందని పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే చంద్రబాబు నాయుడు ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. పుంగనూరు విధ్వంసం చంద్రబాబు నాయుడు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పోలీసుల పై దాడులు చేయడం అమానుషమని, 40 సంవత్సరాల రాజకీయ జీవితమని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు పోలీసులను అవమానపరచడమే కాకుండా కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రసంగాలను చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నమన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నాయకుల వింతపోకడలను ప్రజలు గమనిస్తున్నారని, 2024లో మళ్లీ టీడీపీని ఇంటికే పరిమితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. టీడీపీ



నాయకులు, కార్యకర్తలు పోలీసుల పై దాడులు చేయడం, పోలీసుల వాహనాలు ధ్వంసం చేయడం, తగలబెట్టడం టీడీపీ కార్యకర్తల అనైతిక చర్యలకు నిదర్శనమన్నారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో టీడీపీ చేసిన విధ్వంసకాండకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఖండిస్తుందని ఆయన తెలిపారు. ఉనికిని కాపాడుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ విడిచి వెళ్లకూడదనే ఉద్దేశ్యంతోనే రెచ్చగొట్టే ప్రసంగా లను చేసి పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారని చంద్రబాబు నాయుడి పై ఆయన విమర్శలు చేశారు. సీనియర్ నాయకుడు ఇలా చేయడం మంచి పద్ధతి కాదని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాం లోనే ఎస్సార్బీసీ కాలువకు నీరు తీసుకురావాలని అనాటి అధికార పార్టీలోని తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు చంద్రబాబు నాయుడికి వ్యతిరేకంగా ధర్నాలు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. దానిని ఆయన ఇప్పుడు మరచిపోయారా అని ప్రశ్నించారు. మీరా రాయలసీమ ప్రాజెక్టుల గురించి మాట్లాడేది అని ఆయన అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి...

3లో




# ప్రి(ని)జం ఎక్కడ..!

**కొలిమిగుండ్ల, ప్రభాతవార్త :**

**సిమెంట్ కార్మాగారం నిర్మించి ప్రజలకు కొండంత అండగా ఉంటామన్నారు .. నిరుద్యోగ యువతకు ఉద్యోగం, రైతులకు ఉపాధి కల్పిస్తామన్నారు .. గ్రామంలో సమస్యలను పరిష్కరించి అదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు .. కళ్ల ముందు కోట్లు విలువచేసే సిమెంటు పరిశ్రమ దోబూచులాడుతోందన్నారు .. కళ్లబొల్లి మాటలతో బంగారంలాంటి విలువైన రైతన్నల భూములను తమ గుప్పెట్లోకి తీసుకున్నారు .. చివరికి అన్నంపెట్టే రైతన్నకు కన్నీరే మిగిల్చారు. పరిశ్రమ వస్తుందన్న అశతో విలువైన, సారవంతమైన భూములను విక్రయించిన రైతులకు ప్రిజం పరిశ్రమ యజమాన్యం కన్నీరే మిగిల్చింది. ఇది కొలిమిగుండ్ల మండలంలోని కోటపాడు, కల్వటాల గ్రామాల రైతుల వేదన. వివరాల్లోకి వెళితే మండలంలోని కోటపాడు, కల్వటాల గ్రామల్లో 2008వ సంవత్సరంలో ప్రిజం సిమెంటు కంపనీ పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం రైతులనుండి 2198 ఎకరముల భూములను కొనుగోలుచేసింది. పరిశ్రమ వస్తే తమ గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని, పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని ఏంతో విలువైన భూములను రైతులు తక్కువ ధరకే పరిశ్రమకు విక్రయించారు. దీంతో పాటు పరిశ్రమ ఏర్పాటుకోసం అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1146ఎకరాల ప్రభుత్వ భూమిని కారుచౌకగా పరిశ్రమకు కట్టబెట్టారు. అయితే ఇంతవరకు పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో రైతులు, రైతు కూళీలు తీవ్ర కష్టాలో మునిగిపోయారు. ఉపాధి లేకపోవడంతో వందలాదిమంది రైతు కూళీలు కిలోమీటర్ల దూరంలోని సమీప గ్రామాలకు వలస వెళ్లి కూళిపని చేసుకొని జీవనం సాగిస్తూ వచ్చారు. ఎప్పటికైనా పరిశ్రమ రాకపోదా, తమ బ్రతుకులు మారకపోతాయా అన్న రైతుల ఆశలపై ప్రిజం యజమాన్యం నీళ్లు చల్లింది. చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రిజం సిమెంటు పరిశ్రమ వారు కొనుగోలు చేసిన భూములన్నీ రామ్‌కో సిమెంటు పరిశ్రమకు విక్రయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రైతు కుటుంబాలు లబోదిబో మనే పరిస్థితి నెలకొంది.**

• వివరాలు 3లో



- భూములిచ్చిన రైతులను నిలువునా ముంచిన ప్రిజం
- పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటూ విలువైన భూముల కొనుగోలు
- 15ఏళ్లు గడిచినా పరిశ్రమ లేదు, ఉపాధి లేదు ..
- తాజాగా భూములు రామ్‌కో సిమెంటుకు బదలాయిస్తున్న ప్రిజం
- కల్వటాల, కోటపాడు రైతులకు కన్నీరు మిగిల్చిన ప్రిజం యజమాన్యం
- రెండేళ్ల క్రితం ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమ నిర్మిస్తామని ఎమ్మెల్యేకు హామీ పత్రం
- ప్రజా ప్రతినిధులు, అధికారుల సాక్షిగా లిఖిత పూర్వక హామీ ఇచ్చి మోసం
- అంతలోనే పరిశ్రమ నిర్మించలేమంటూ అమ్మకానికి భూములు
- పోరాటానికి సిద్ధమవుతున్న కల్వటాల రైతులు

# 861 అడుగులకు చేరిన.. శ్రీశైలం రిజర్వయర్



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు08, ప్రభాతావార్త**

శ్రీశైలం రిజర్వయర్ నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 861.20 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామార్థ్యం 109.8070 టియంసిలుగా నమొదు అయింది. ఈక్రమంలోనే జూరాల నుండి విడుదల అయ్యే స్పిల్‌వే నీరు నిలిచిపోయింది. కేవలం విధ్యుత్‌ఉత్పత్తి ద్వారా మాత్రమే 35,837 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లోగా వచ్చిచేరుతుంది. శ్రీశైలం జలవిధ్యుత్ కేంద్రాల్లో ఎటువంటి ఉత్పత్తి జరగడం లేదు.

# సామాన్య భక్తుల.. సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ

**: శ్రీశైలందేవస్థానం ఈఓ లవన్న**

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు06, ప్రబాతవార్త**

శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శన బాగ్యం కోరకు వచ్చే సామాన్య భక్తుల సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందని శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి సుద్దన కుంట లవన్న ఆదివారంనాడు తెలిపారు. కాగా సామాన్య భక్తులకు ఉచితంగా మహామంగళహరతి సమయంకు అనుమతించడం, వారంలో నాలుగు రోజుల పాటు భక్తులకు ఉచితంగా శ్రీస్వామివార్ల స్పర్శదర్శనాన్ని కల్పించడం, తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి నెలలో ఒక రోజున ఉచితంగా నిర్దిష్టమైన ఆర్జితసేవను జరిపించడం, భక్తులకు ఉచితంగా బ్యాటరి వాహనాలను ఏర్పాటు చేయడంలాంటి చర్యలను చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రతిరోజు ఉదయం మహామంగళహరతి ప్రారంభసమయం నుంచే అనగా వేకువ జామున గం.4.30ల నుంచే స్పర్శ దర్శనం క్యూలైన్(ఉచిత క్యూలైన్ దర్శనం)ద్వారా వచ్చే సామాన్య భక్తులకు దర్శనానికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు ఉదయం మరియు సాయంకాలాలలో సమారు



మూడు వేల మందికి పైగా సామాన్య భక్తులు ఉచితంగా శ్రీస్వామిఅమ్మవార్ల మహ మంగళ హరతి దర్శనానికి చేసుకోగలుగుతున్నారని చెప్పారు. సామాన్య భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలనే భావనతో సుప్రబాతం మరియు మహామంగళహరతి టికేట్లును నిలుపుదల చేసి మహ మంగళహరతికి సామాన్య భక్తులను అనుమతించడం జరుగుతుందని అన్నారు. వారంలో నాలుగు రోజుల పాటు మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో మధ్యాహ్నం గం.2.00ల నుంచి భక్తులు శ్రీస్వామివారి ఉచితంగా స్పర్శదర్శనం 2500 మందికి పైగా భక్తులు శ్రీస్వామివారి స్పర్శదర్శనం చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ మరియ దేవస్థానం సామాన్య భక్తుల సౌకర్యల కల్పన మరియు సులభతర దర్శనాల విషయమై ఆహర్నిషలు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు.

# చంద్రబాబు పొత్తు లేకపోతే రాజకీయం చేయలేడు : ఎంఎల్ఏ

**మంత్రాలయం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పొత్తు లేకపోతే రాజకీయం చేయలేడని ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో వైసిపి నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాజకీయంలో పొత్తులతో కాదు దమ్ముంటే సింగిల్‌గా పోటీ చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసిపిని ప్రజలు మరోసారి గెలిపిస్తారని చెప్పారు. పుంగనూరులో జరిగిన దాడులు టిడిపి నాయకులే చేశారన్నారు. చంద్రబాబు ఎప్పటికైనా గొడవలు, ఘర్షణలు సృష్టించడానికి అనేక రకాల ప్రయత్నాలు



చేస్తుంటారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముందు అందరూ ఓడిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సీతారామిరెడ్డి, మండల కన్వీనర్ భీంరెడ్డి, ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, విఖ్యాత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో.. అమృత్ భారత్ స్టేషన్

**: కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన**

**కర్నూలు, ఆగస్టు 06పభావార్త :** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి కర్నూలు రైల్వే స్టేషన్ నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడం జరిగిందని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 508 రైల్వే స్టేషన్లు (భారతీయ రైల్వేల అంతటా) పునరాభివృద్ధి లో భాగంగా కర్నూలు రైల్వే స్టేషన్ నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. కర్నూలు రైల్వే స్టేషన్ నందు ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్న పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, కర్నూలు శాసనసభ్యులు హాఫీజ్ ఖాన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బివై. రామయ్య, రైల్వే శాఖ సీనియర్ డిఎన్సి లైన్స్ అనిల్ కుమార్, రైల్వే శాఖ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మన కర్నూలు సిటీ ఎంపిక కావడం చాలా సంతోషమన్నారు. దక్షిణాది రాష్ట్రాలను హైదరాబాదు తో అనుసంధానం చేస్తున్న ముఖ్యమైన మార్గాలలో ఉన్న కర్నూలు నగర ప్రజల సౌకర్యార్థం దాదాపుగా రూ.42.62 కోట్ల వ్యయముతో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది అని అన్నారు. భారతదేశంలో రైల్వే వ్యవస్థ అతి పెద్ద వ్యవస్థని ఈ వ్యవస్థను రక్షించుకోవడంలో హక్కులతో పాటు మనకు కూడా కొన్ని బాధ్యతలు ఉంటాయని అన్నారు. రైల్లో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు టికెట్ కొనాలని, రైల్వే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఉద్యమాల సమయంలో రైల్వే ఆస్తులకు నష్టం కలవకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనదే అన్నారు. ముఖ్యంగా కర్నూలు పట్టణం నుండి మచిలీపట్నంకు వెళ్లే ట్రైన్ ను పునరుద్ధించాలని అలాగే ఈ ట్రైన్ మూడు రోజులకు ఒకసారి కాకుండ ప్రతిరోజు వెళ్లేలా చూడాలని, కర్నూలు నుండి విజయవాడకు రోడ్డు మార్గం సరిగా లేనందున ప్రజానికం రైల్వే ప్రయాణంపై ముగ్గు చూపుతారు కావున ప్రతిరోజు కర్నూలు నుండి విజయవాడకు రైలును నడపాలని, ఈ రైల్వే స్టేషన్ కు ఫిట్ లెన్స్ ఏర్పాటు చేయాలని, వర్క్ షాప్ కూడ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను ఎంపీ కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ మన కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ దాదాపు 43 కోట్ల రూపాయల వ్యయంతో రీ మోడలేషన్ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నిధులను మంజూరు చేయించడంలో మన స్థానిక పార్లమెంట్ సభ్యుల కృషి ఎంతగానో ఉందన్నారు, అందుకు మన ఎంపీ కి ధన్యవాదాలు తెలుపుకోవాలన్నారు. కర్నూలు శాసనసభ్యులు హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ మన ప్రాంతం వెనుకబడిన ప్రాంతం అగుట




చేత పేద ప్రజలు తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సౌకర్యం ఒక రైలు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈరోజు అమృత్ భారత్ స్టేషన్ పథకం లో భాగంగా కర్నూలు ఎంపిక చేసి మన రైల్వే స్టేషన్ ను పునరుద్దీకరణ చేస్తున్నందుకు ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రి, మన ఎంపీకి మనం కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఇన్చార్జి రాఘవేంద్ర, ఎన్సిసి కర్నూలు, నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, స్టేషన్ మేనేజర్ సుంకన్న, రైల్వే స్టేషన్ సిబ్బంది, జిల్లా అధికారులు, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, ప్రజా సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, ఎన్సిసి విద్యార్థులు, వివిధ పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆందోళన...

కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కర్నూలు రైల్వే అభివృద్ధికి తనవంతుగా కృషి చేసినట్లు పేర్కొన్నారు. కర్నూల్ కోచ్ ఫ్యాక్టరీ అభివృద్ధి నిమిత్తం గత ఎంపీ, తాను ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన నిధులను తెప్పించగలిగామన్నారు. రైల్వే అధికారులు కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. రైల్వే అధికారులు దక్షిణ భారత రైల్వే ప్రాజెక్టులపై అలసత్వం వహిస్తూ చిను చూపు చూస్తున్నారని ఆరోపించారు. అలాగే రైల్వే ప్రాజెక్టులు తానే తీసుకొచ్చాననీ చెబుతుండగా




బిజెపి నేతలు రామస్వామి ఆధ్వర్యంలో ఎంపీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నిరసన వ్యక్తం చేశారు. వేదిక మీదికి దూసుకెళ్లారు. గత నాలుగేళ్లుగా కనబడని ఎంపీ.. రైల్వే ప్రాజెక్టులను తానే తీసుకొచ్చాన ని చెప్పడం హాస్యాస్పదం ఉందన్నారు. దీంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు ఆందోళనకారులకు సర్ది చెప్పారు.

# సెల్‌లో యాప్.. వివరాలు ఫ్లాప్.!

- అంగన్‌వాడీలకు యాప్‌తో అవస్థలు..
- నూతన ఎఫ్ఆర్ఎస్ నమోదుతో ఇబ్బందులు..
- సాంకేతిక సమస్యతో కష్టాలు..

**కోసిగి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

ఇప్పటికే వైఎస్సార్ సంపూర్ణపోషణ, పోషణ ట్రాకర్ వంటి యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసారు.. చిన్నారుల ఎత్తు, బరువు, గృహ సందర్శనలు, కేంద్రాల్లో రోజువారీ హాజరు, పోషకాహారం పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 14 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి..వీటి పరిధిలో ప్రతి ప్రాజెక్టు పరిధిలో 250 నుండి 400 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లల వివరాలతో పాటు కొత్తగా వైఎస్సార్ సంపూర్ణపోషణ, టేక్ హోం రేషన్(టిహెచ్ఆర్) అంటే నేరుగా బాలింత, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారికి అవసరమైన పోషకాలతో కూడిన సరుకులను అందించడం జరుగుతుంది.. ఈ నేపథ్యంలో వీరు సరుకులను అందించే సమయంలో వారి నుండి ముఖ చిత్రంను సెల్‌ఫోన్‌లో యాప్‌ల ద్వారా నమోదు చేయాలి.. అయితే ఈ యాప్‌లు సరిగా పనిచేయక పోవడంతో వారికిచ్చిన టార్గెట్ చేయలేక పోతున్నట్లు తెలుస్తోంది.. యాప్ వివరాల నమోదుతో ఒత్తిడికి గురవుతున్నారు.. కొంత మందికి యాప్‌లపై అవగాహన లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2వ తేది నుండి గర్భిణులు, బాలింతలకు ముఖ హాజరు నమోదు తప్పనిసరి చేస్తూ, ఇంటికే పోషకాహ్హారం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు కలవరం




చెందుతున్నారు..ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా కార్యకర్త, సహాయకురాలు ఇద్దరి ముఖ నమోదుతో పాటు గర్భిణుల, బాలింతల వివరాలను, ఫోటోలను యాప్‌లో పొందుపరచాలి.. దీనిపై అవగాహన లేక కార్యకర్తలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు వ్యవప్రయాసాల కోర్చి వెళ్తున్నారు.. ఫోన్‌లో సాంకేతిక సమస్యలతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.. ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల విద్యకు సైతం ఆటంకం కలుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.. ప్రభుత్వ స్పందించి యాప్‌ల భారాన్ని తగ్గించాలని పలువురు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

**పని ఒత్తిడి పెరుగుతోంది:** రేణుకమ్మ, జిల్లా అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్..

రోజురోజుకూ పని ఒత్తిడి పెరుగుతుండడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు మానసిక ఆందోళనకు గురవుతున్నారు.. ఇప్పటికే ఉన్న యాప్‌లతో ఫోన్లు సక్రమంగా పని చేయడం లేదు.. మళ్లీ కొత్తగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో మరి కొంత ఇబ్బందులు నెలకొంటున్నాయి.. అంగన్‌వాడీ సిబ్బందికి యాప్‌ల భారం, పని ఒత్తిడి తగ్గించాలి..

# తుమ్మల వాగు బ్రిడ్జికి రెండురోజుల్లో మరమత్తులు

**కర్నూలు రూరల్, ఆగస్టు 6, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఉల్చాల గ్రామ సమీపంలో ఉన్న తుమ్మల వాగు బ్రిడ్జి రెండ్రోజుల క్రితం హఠాత్తుగా ఒకవైపు కుప్పకూలిపోయింది. అయితే అదృష్టవశాత్తు ఇందులో ఎవ్వరికి ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. కర్నూలు మండల ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి వాసుల స్వగ్రామమైన ఉల్చాల గ్రామానికి



బ్రిడ్జి కూలి రాకపోకలు కష్టతరమైన నేపథ్యంలో శనివారం ఆర్అండ్‌బి అధికారులు డిఈ, ఈఈలను కలిసి సమస్యను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని వారు కోరారు. తక్షణమే స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు కూలిన బ్రిడ్జిని పరిశీలించి వారి సిబ్బందికి సలహాలు ఇచ్చి ఆదివారం బ్రిడ్జికి పూర్తిగా మరమత్తులు చేసి బ్రిడ్జి అందుబాటులోకి వచ్చే విధంగా పనులు చేశారు. ఉల్చాల, రేమట గ్రామాలు దాదాపు 20వేల జనాభా ఉన్న గ్రామాలని ఈ గ్రామాలకు రాకపోకలు బంద్ కావడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన స్థానిక ప్రజా ప్రతినిధులు ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి వాసులు దాదాపు రెండ్రోజుల నుండి కూలిన బ్రిడ్జి దగ్గర పనులుపరిశీలిస్తూ ఆదివారంకి పనులు పూర్తయ్యే విధంగా గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ పనులు దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విద్యాసాగర్, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి వాసులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరం పేదలకు వరం..

**తుగ్గలి,ఆగస్టు 6,ప్రభాతవార్త**
ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అది పేదలకు గొప్ప వరమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పగడిరాయి గ్రామంలో మాజీ జడ్పిటిసి జగన్నాథ్‌రెడ్డి,స్థానిక వైసిపి నాయకుడు బసిరెడ్డిల ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలోని పెంచికలపాడు విశ్వభారతి జనరల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కాంతారెడ్డి,ఎండి జనరల్ డాక్టర్ నికేతన్,ఆర్థోపెడిక్ డాక్టర్ రాఘవేంద్ర,గైనిక్ డాక్టర్ వర్మ,మేనేజర్ శివకుమార్‌లచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు మాజీ జడ్పిటిసి జగన్నాథ్‌రెడ్డి,సర్పంచ్ సౌజన్య,సర్పంచ్ గౌరవ సలహాదారులు హనుమంతులు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ అందరు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి నిరుపేద కుటుంబానికి వైద్యం అందించాలనే లక్ష్యంతో విశ్వభారతి హాస్పిటల్ వారు వైద్యశాలలో క్షణం తీరిక లేకుండ వైద్య పరీక్షలు నిర్వహించే డాక్టర్ల బృందం ఉచిత వైద్యశిబిరానికి తరలివచ్చి అన్నిపరీక్షలు చేసి సామాన్య ప్రజలకు సేవలు చేయడమే కాక మందులు కూడా ఉచితంగా అందించడంతో వీరి సేవలు ఎప్పటికీ



మరవలేమన్నారు. అలాగే విశ్వభారతి హాస్పిటల్ మేనేజర్ శివకుమార్ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 230ఓపిలను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, హిమోగ్లోబిన్, ఈసిజి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మరింత ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి విశ్వభారతి ఆసుపత్రి నందు మెరుగైన చికిత్సను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జిట్టా నాగేష్,ఎంపిపి ఎర్రనాగప్ప,రామకొండ సుధాకర్‌రెడ్డి,తుగ్గలి శేఖర్‌రెడ్డి,నాగ భూషణంరెడ్డి,లాల్‌రెడ్డి,బొల్లవాని పల్లెశేఖర్‌రెడ్డి,రామాంజి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి కల్పనకు మెరుగైన వైద్యం అందించాలి

**ఆదోని రూరల్,ఆగస్టు 6,ప్రభాతవార్త**
కల్పన అనే విద్యార్థికి ప్రభుత్వం తరుపున మెరుగైన వైద్యం అందించాలని డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజు,ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్పన అనే విద్యార్థి హాస్టల్‌లో ఉండగా అక్కడ ఒక విషపూరితమైన పురుగు తాకడం వల్ల విద్యార్థి స్పృహ తప్పి కిందకు పడడం జరిగిందని అనంతరం ఆ విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని ఆ విద్యార్థికి క్రిటికల్‌గా ఉండడం వల్ల ఆదోనిలో మధు ఆసుపత్రిలో చేర్చారన్నారు. కావున ఆ విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టల్‌ను శుభ్రం చేయకపోవడం వలనే విషపురుగులు వస్తున్నాయన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నటువంటి బిసి హాస్టల్ వార్డెన్,అందులో పనిచేస్తున్న వర్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఒక్కసారి కూడా హాస్టల్‌కు వచ్చి విజిట్ చేయకుండ సీటుకు మాత్రమే పరిమితం అవుతూ కాలయాపన చేస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎంతోమంది విద్యార్థులు పల్లెల నుండి చదువుకోవడానికి హాస్టల్‌కు వస్తే సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాగే కొనసాగితే డిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురేష్,మండల అధ్యక్షుడు హరికృష్ణ,డివిజన్ ఇంచార్జ్ విష్ణు,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన శని

**- ఇకనైనా ఆపు నీ నీచమైన రాజకీయాలు**



**కల్లూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త:** పుంగనూరులో చంద్రబాబు నాయుడు పర్యటన ద్వారా అక్కడ ఉన్న టిడిపి కేడర్‌ను రెచ్చగొట్టి ఆప్రాంతంలో అల్లర్లకు అజ్యంపోసిన చంద్రబాబు నాయుడు వైఖరికి నిరసనగా ఆదివారం మండలంలోని చెన్నమ్మ సర్కిల్‌ల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అదేశాల మేరకు కల్లూరు అర్బన్‌లోని కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేసి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు కార్పొరేటర్ల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పట్టిన శని ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమిచేయలేక ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పథకాలతో ప్రజల్లో వస్తున్న అదరణను చూసి ఓర్వలేక ఇదంతా సృష్టిస్తున్నారని చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేశారు. అనంతరం శ్వేతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న అదరణ తట్టుకోలేక చంద్రబాబు నాయుడు ఇంత నీచమైన రాజకీయాలకు పాల్పడుతన్నారని ఆరోపించారు. మీరు ఎన్ని కుట్రలు చేసినా రానున్నది వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. ఈకార్యక్రమంలో 16 వార్డుల కార్పొరేటర్లు, వైయస్ఆర్‌సీపీ నాయకులు, పలువురు కార్యకర్తలు, వార్డు ఇంచార్జీలు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

**- రూ.34 వేలు నగదు స్వాధీనం**

**ఆదోనిటౌన్, ఆగస్టు06, ప్రభాతవార్త ;**
పట్టణంలోని బసాపురం రోడ్డులోని కళ్యాణ్ ఫ్యాక్టరీ ఆవరణలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహా విలేకరులకు తెలిపారు. కౌడల్‌పేటకు చెందిన చిలక రాఘవేంద్ర, సంతపేట కళ్యాణ్‌కుమార్, బైచిగేరికి చెందిన తెలుగు నరసప్ప, రంగారెడ్డి, హవన్నపేటకి చెందిన రంజాన్ రహంతుల్లా, బసాపురంకు చెందిన గంగన్న, ఖాజీపురంకు చెందిన రఫీక్,



హనుమాన్నగరర్‌కి చెందిన రవిలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.34 వేలు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన పేకాట, మట్కా, అక్రమంగా కర్ణాటక మద్యం తరలింపు, నాటుసారా తయారీ ఇలాంటి వాటికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది లక్ష్మణ్, భీమ్‌లా నాయక్, రంగస్వామి, రామచంద్ర, దయాకర్, ముస్తక్, మహబూబ్‌బాషాలు పాల్గొన్నారు.

# మోడీ హటావో.. దేశ్‌కి బచావో..సేవ్ పబ్లిక్ సెక్టార్.. సేవ్ డెమోక్రసీ..!

**పత్తికొండ,ఆగస్టు 6,ప్రభాతవార్త :**
మోడీ హటావో..దేశ్‌కి బచావో..సేవ్ పబ్లిక్ సెక్టార్..సేవ్ డెమోక్రసీ..అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య అన్నారు. ఈ నెల 9వ తేదీన జరిగే మహా పడావ్ కార్యక్రమం జయప్రదం చేయాలని ఆదివారం ఏఐటియుసి ఆధ్వర్యంలో



పట్టణంలో బైక్ ర్యాలీని రామచంద్రయ్య ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుండి పట్టణంలో ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్,ఆర్‌టిసి బస్టాండ్,నాలుగు స్థంబాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ కృష్ణయ్య,సిపిఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి యం కారన్న,ఏఐటియుసి తాలుక అధ్యక్ష,కార్యదర్శులు నెట్టికంటయ్య,యం రంగన్న,ఏఐటియుసి తాలుక గౌరవ అధ్యక్షులు బి మాదన్న,ఏఐటియుసి తాలుక గౌరవ కార్యదర్శి గుండుభాషా,తాలుక ఉపాధ్యక్షులు యం రాజప్ప,యం రామచంద్ర,గ్రామ పంచాయతీ సంఘం నాయకులు ఉచ్చురప్ప,సంజన్న,గడ్డ రంగస్వామి,యంకె సుంకన్న,పెయింటర్స్ సంఘం నాయకులు బి తిమ్మన్న,ఆదినారాయణ,బేల్దారు సంఘం నాయకులు రంగన్న,బిటి వీరేష్ ,హరి పాల్గొన్నారు.

# ప్రజాకవిని కోల్పోవడం భాదాకరం : పారా రాఘవేంద్ర

**మద్దికెర,ఆగస్టు 6,ప్రభాతవార్త :** ప్రజా యుద్దనౌక ప్రజా కవి గద్దర్‌ను కోల్పోవడం భాదాకరమని జిల్లా ఏపి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పారా రాఘవేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటలతో ప్రజా ఉద్యమానికి ఊపిరిపోసి,ఆటపాటలతో చైతన్యం రగలించి తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసి ఆపరా రిక్ష అనే పాటను గద్దర్ అనే ఆల్బమ్ కోసం రాశారన్నారు. ఈ ఆల్బమ్ అందరిని ఆకట్టుకోవడంతో విఠల్‌రావు పేరు కాస్త గద్దర్‌గా స్థిరపడింది. గద్దర్ కుటుంబ నియంత్రణ,పారిశుద్ధ్యం వంటి సామాజిక అంశాలపై బుర్రకథలను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించడంలో మొదటిస్థానం ఆయనదేనన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# ఎస్‌సి,ఎస్‌టిలకు ప్రభుత్వ మిగులు భూమిని పంపిణీ చేయాలి

**- ఏపి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్**

**కర్నూలు రూరల్,ఆగస్టు 6,ప్రభాతవార్త :** ఎస్‌సి,ఎస్‌టిలకు ప్రభుత్వ మిగులు భూమిని పంపిణీ చేయాలని ఏపి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో మరియు నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి,ఎస్‌టిలకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేస్తుంది. కొన్ని చోట్ల భూపంపిణీ జరగనందున ప్రభుత్వ పరిధిలో ఉన్న భూమి



కొంతమంది రాజకీయ నాయకుల అండతో కబ్జాలు చేసి నిజమైన ఎస్‌సి,ఎస్‌టిలకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కర్నూలు మండలంలో దిగువపాడు గ్రామంలో కూడా వందల ఎకరాల ప్రభుత్వ భూమి మిగులు ఉన్నందున ఎస్‌సి,ఎస్‌టిలకు మిగులు భూమిని పంపిణీ చేసి ఎస్‌సి,ఎస్‌టి సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆయన కర్నూలు జిల్లా డిఆర్‌డిఓను కలిసి వినతిపత్రం అందచేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**పత్తికొండ,ఆగస్టు 6,ప్రభాతవార్త :**
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మాలతి అన్నారు. ఆదివారం ప్రభుత్వం సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం-2 నందు వసతి గృహం విద్యార్థులకు సరఫరా చేసిన బెడ్‌షీట్స్,పెన్స్,పెన్సిల్,జామెంట్రీ బాక్స్, మ్యాప్స్, బుక్స్, గ్రాఫ్ బుక్స్‌ను హెచ్ఎం మాలతి,మ్యాథ్స్ అసిస్టెంట్ సుధాకర్ గుప్తలు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు మెటీరియల్ అందచేశారు. అలాగే విద్యార్థులకు తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులందరికి చదువు గురించి మంచి విషయాలు చెప్పడం జరిగింది.



# హాస్టల్ విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ

**తుగ్గలి,ఆగస్టు 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని జొన్నగిరి బాలుర వసతి గృహంలోని 150మంది విద్యార్థులకు బెడ్‌షీట్లు,జామెంట్రీ బాక్స్,మ్యాప్ పాయింటింగ్,గ్రాఫ్ బుక్స్, పెన్నులు,స్కెచ్ పెన్నులను విద్యాకమిటీ చైర్మన్ గుంతరఘు,హాస్టల్ వార్డెన్ రమేష్‌లు అందచేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ రమేష్ మాట్లాడతూ హాస్టల్‌లో దాదాపు 160మంది విద్యార్థులున్నారని వారిలో 150మందికి మాత్రమే విద్యకు ఉపయోగపడే 11రకాల వస్తువులను అందించడం జరిగిందని తెలిపారు. మిగిలిన విద్యార్థులకు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో మెలిగి ఉన్నతంగా చదివి హాస్టల్‌కు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్,విద్యార్థులు తదితరులున్నారు.



# కస్తూరిబా గాంధీ పాఠశాలలో సీట్లు..ఉష్ కాకి..

**మద్దికెర,ఆగస్టు 6,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో కస్తూరిబా గాంధీ విద్యానిలయం నందు డ్రాప్ ఔట్ విద్యార్థులకు తల్లిదండ్రులు లేని విద్యార్థులు, గ్రామీణ ప్రాంతానికి చెందిన బిలో ప్రాపర్టీకి చెందిన అనగారిన వర్గాల వారి పిల్లలను కస్తూరిబా గాంధీ విద్యానిలయంలో చేర్చుకుని విద్యాబుద్దులు నేర్పమని ప్రభుత్వాలు ఆదేశాలిస్తే ఇప్పటివరకు తల్లిదండ్రులు ఉన్న పిల్లలే అధికంగా ఈ విద్యానిలయంలో విద్యను అభ్యసిస్తున్నారు. అనేకమంది నిరుపేద తల్లిదండ్రులు లేని పిల్లలు కస్తూరిబా గాంధీలో సీట్ల కోసం కాళ్లరిగేలా తిరిగినప్పటికీ అధికారులు కనికరించడంలేదు. వీరి కోసం కేటాయించిన సీట్లు ఉష్‌కాకి అయినట్లు పలువురు అన్నారు. పరిమిత సీట్ల వరకే అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందని పాఠశాల యాజమాన్యం తెలుపుతుంది. మరి నిరుపేద విద్యార్థులమైన మేము విద్యకు దూరమై కూలిపనులకు వెళ్లాల్సి వస్తుంది. మా తల్లిదండ్రులు బతుకుజీవుడా అంటూ ఇతర ప్రదేశాల్లో జీవనం కొనసాగిస్తున్నారు. మా సమస్యకు పరిష్కారం ఏమిటని పలువురు విద్యార్థినీలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



# రాహుల్‌గాంధీ పట్ల సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

**ఆదోని రూరల్,ఆగస్టు 6,ప్రభాతవార్త :**
రాహుల్‌గాంధీ పట్ల సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ నీలకంఠప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ నీలకంఠప్ప మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కోలార్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో మోడీలు ఉన్న పేరుతో లలిత్ మోడీ,నీరవ్ మోడీలు ఆర్థిక నేరాలు చేసి దేశం నుంచి పారిపోయిన వారి గురించి ఉద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడగా ప్రధానమంత్రి మోడీ రాజకీయ కక్ష్యతో గుజరాత్ సూరత్ కోర్టులో రెండేళ్ల శిక్ష రాహుల్‌గాంధీ పట్ల విధించిన సంగతి విధితమేనని ఇలాంటి దుర్మార్గమైన తీర్పులకు చెంపపెట్టుగా సుప్రీం కోర్టు రాహుల్‌గాంధీ శిక్ష పట్ల స్టే విధించడం అనేది ఇది ప్రజాస్వామ్య విజయమన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు,కార్యదర్శి సాయినాథ్,యూత్ కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి వీరేష్,శ్రీనిత,మనియార్,ఇర్ఫాన్,ఐఎన్‌టియుసి జయరాం,మద్దిలేటి,రాము తదితరులు పాల్గొన్నారు.



# హొళగుందలో ఆర్ఏఎఫ్ కవాతు

**హొళగుంద,ఆగస్టు 6,ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన హొళగుందలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండ మండల ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండ ఉండేందుకు పురవీధుల గుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) కవాతు నిర్వహించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొదట హొళగుందలోని పురవీధుల గుండా అనంతరం కొగిలతోట గ్రామంలోని ఎస్‌సి కాలనీ నందు కవాతు నిర్వహించారు. వినాయకచవితి తదితర పండు గలు, ఎన్నికల నేపథ్యంలో ఈ పోలీస్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నేరాల కట్టడికి పోలీసులు ఉన్నప్పటికీ అల్లర్లు,సంఘవిద్రోహ చర్యలు,మత కల్లోలం వంటివి దృష్టిలో ఉంచుకుని కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించామన్నారు. సుమారు 70మంది పోలీసులు ఫ్లాగ్‌మార్చ్‌లతో పాల్గొన్నారు.



# నిత్యన్నదాన వితరణ పథకంకు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు06,ప్రభాతవార్త**
శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన వితరణకు నంద్యాల వాస్తవ్యులు కోమిరెడ్డి రఘునాధరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,000/-ల విరాళమును దేవస్థానం విరాళాల కేంద్రం పర్యవేక్షకులు సి.హెచ్.మధుసుదన్‌రెడ్డికి అందజేసారు. ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోని అనంతరం విరాళం అందజేసారు.తదుపరి దాతలను శ్రీస్వామివార్ల శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను దాతలకు అందజేసారు.



# ఎన్నటికీ అంతం కానిది స్నేహం

**హొళగుంద,ఆగస్టు 6,ప్రభాతవార్త :** స్నేహ బంధం ఎప్పటికీ అంతం కానిదని 2000బ్యాచ్ పూర్వ విద్యార్థులు బిటి నబీరసూల్,వలీ,మార్లమడికి రమేష్,నాగరాజు,అక్రమ్,జాకీర్‌లు అన్నారు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 2000బ్యాచ్ పూర్వ విద్యార్థులు హొళగుందలో కలుసుకుని కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ భారతంలో ఉత్తమ స్నేహితుల విషయానికి వస్తే కర్ణుడు,దుర్యోధనుడు,కృష్ణుడు,కుచేలుడని ప్రధానంగా చెబుతారన్నారు. మిగిలిన స్నేహితులు కూడా కృష్ణుడు చుట్టే తిరుగుతారన్నారు. మన పురోగతికి ఎలాంటి వ్యక్తులు అడ్డుపడతారో..చాణక్య నీతి..వివరిస్తుందన్నారు. ప్రపంచంలోనే ఒక్కొక్కరిది ఒక్కోరకమైన ప్రవర్తన ఉంటుందని కొందరు అందరితో కలివిడిగా కలిసిపోతారని మరికొందరు మూభావంగా ఉంటారన్నారు. ఇంకొందరు మాట్లాడుతారు కానీ కొన్ని పరిధులు విధించుకుంటారన్నారు. స్నేహం విషయం కూడా అంతేనని కొందరు కొత్త స్నేహితులను తొందరగా ఏర్పాటు చేసుకుంటారన్నారు. మరికొందరు ఎక్కువమంది స్నేహితులను సర్దిపెట్టుకుంటారన్నారు. ఇలాంటి ఫ్రెండ్‌షిప్ డేలు మరెన్నో జరుపుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు,శివ,బద్రప్ప,ఎంపి వీరేష్ తదితరులున్నారు.

# బొబ్బల బాలగుర్రెడ్డి మృతికి సంతాపం

**: బిసి ఇంధిరారెడ్డి, మాజీ సర్పంచ్**
**బిసి రాజారెడ్డి**

**బనగానపల్లె రూరల్, ఆగష్టు 6, ప్రభాతవార్త:**
బనగానపల్లె మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బొబ్బల బాలగుర్రెడ్డి (72) ఆదివారం మృతిచెందడం జరిగింది. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బిసి ఇంధిరారెడ్డి, బనగానపల్లె గ్రామ మాజీ సర ్పంచ్ బిసి రాజారెడ్డిలు గ్రామానికి చేరకొని బాలగుర్రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులకు తమప్రగాఢ సానుభూతి తెలిపారు.



# తెదేపా అధినేత చంద్రబాబు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

**- ఆలూరు వైకాపా ఇంచార్జ గుమ్మనూరు నారాయణస్వామి**

**ఆలూరు,ఆగస్టు 6,ప్రభాతవార్త**
తెదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఆలూరు వైకాపా ఇంచార్జ గుమ్మనూరు నారాయణస్వామి,దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్ నందు వైకాపా నాయకులు,కార్యకర్తలతో కలిసి పుంగనూరులో చంద్రబాబు సృష్టించిన విధ్వంసాన్ని నిరసిస్తూ పోలీసులపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా ఖండిస్తూ వారు నిరసన తెలియజేసి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో తన పర్యటనను ప్రజలు పట్టించుకోవడం లేదని గూండాలు,రౌడీలను వెంటపెట్టుకుని హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో అరాచక రాజకీయం చేసి చిత్తూరు జిల్లాలో తెదేపా గూండాలను రెచ్చగొట్టి రక్తపాతం సృష్టించారన్నారు. తెదేపా నాయకులు దాడి చేసి వైసిపి కార్యకర్తలు,పోలీసులను తీవ్రంగా గాయపరచడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థకే ఈ ఘటన మాయని మచ్చ అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రంగమ్మ,మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ చిన్నఈరన్న,మాజీ జడ్పిటిసి రామ్‌భీమ్‌నాయుడు,ఎంపిటిసి దేవరాజు,కురుకుంద సర్పంచ్ దేవిరెడ్డి,కోకన్వీనర్ హనుమయ్య,వైకాపా నాయకులు వీరేష్,ఈరన్న,నాగేంద్ర తదితరులున్నారు.



# కల్లుదేవకుంట సొసైటీని అభివృద్ధి బాటలో నడిపిస్తా

**- సొసైటీ చైర్మెన్ రఘునాథ్‌రెడ్డి**

**కల్లుదేవకుంట(మంత్రాలయం),ఆగస్టు 6,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కల్లుదేవకుంట సొసైటీని అభివృద్ధి బాటలో నపిస్తానని నూతన సొసైటీ చైర్మెన్ కల్లుదేవకుంట రఘునాథ్‌రెడ్డి అన్నారు.ఆదివారం నూతన సొసైటీ ఛైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 50 మందితో ప్రారంభమైన సొసైటీ నేడు వందలమంది ఖాతాదారులతో వర్ధిలుతున్నట్లు తెలిపారు.గతంకన్నా మెరుగ్గా ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమై ఋణాలు మంజూరు చేసి ఆదుకుంటామని చెప్పారు.అయితే రైతులు తీసుకున్న ఋణాలను సకాలంలో చెల్లిస్తే సొసైటీ అభివృద్ధికి సహకరించిన వారవుతారన్నారు.తనకు సొసైటీ ఛైర్మెన్‌గా అవకాశం కల్పించిన ఎంఎల్ఏ బాలనాగిరెడ్డికి,సీతారామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి,విఖ్యాత్‌రెడ్డి,మాజీ ఛైర్మెన్ వెంకటరెడ్డి,సిఈఓ వెంకటేశ్వర్లు,సూపర్‌వైజర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# చుండూరు దళిత మృతవీరులకు నివాళులు



**హొళగుంద,ఆగస్టు 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇంగళదహాల్ గ్రామంలో ఆదివారం కామ్రేడ్ గాదెప్ప అధ్యక్షతన కారంచేడు,చుండూరు దళిత మృతవీరులకు 2ని॥లు మౌనం పాటించి సంతాపసభను నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున,పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి మనీ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి వెంకప్పలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో దళితులు,మైనార్టీలు,మహిళలపై విచక్షణరహితంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని నిరోధించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. దళితులు,మైనార్టీలు,ఆదివాసీలపై మతోన్మాద ప్యాసిస్టు దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.కారంచేడు,చుండూరు,వేంపెంట దళితులపై మారణ హోమాన్ని సాగించి దళితుల ప్రాణాలను బలిగొన్నారని దీనికి వ్యతిరేకంగా రాష్ట్రంలో దళిత బహుజన ఉద్యమాలు ముందుకొచ్చాయని దళితులు,ఆదివాసీలు,మతమైన టీలు హక్కుల కొరకు,ఆత్మగౌరవం కొరకు పోరాడాలని సభలో నిర్ధేశించారు. పోరాటాల వలనే హక్కులు సాధించుకుంటామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ముని,బొజ్జప్ప,షేక్ అమ్మమల్లప్ప,క్రి,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపు




**ఆదోనిలీగల్, ఆగస్టు06, ప్రభాతవార్త ;** ఆదోని డివిజన్, జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, కార్యదర్శివర్గసభ్యులు గోపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వారు ఆదోనిలోని సుందరయ్యభవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన ఆదోని నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర 7వ తేదీన కర్నూలు కలెక్టరేట్ చేరుకుంటుందన్నారు. ఈ పాదయాత్ర సందర్భంగా వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికై జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న తాగునీరు, సాగునీటి ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కర్నూలు జిల్లాలో రాజకీయంగా అత్యున్నతమైన పదవులు పొందిన రాజకీయ నాయకులు కర్నూలు జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. జిల్లాలో ఒక పరిశ్రమ కూడా లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యంలో జిల్లా వెనుకబాటుతనంలో ఉందన్నారు. సీపీఎం నిర్వహించిన మహాపాదయాత్రకు జిల్లాలో అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పడుతూ సమస్యలను పాదయాత్ర దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, తిక్కప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మడమ తిప్పని మహానేత దివంగత వైఎస్సార్

**- పంచాయతీరాజ్ వింగ్ అండ్ జోనల్ కర్నూలు,నంద్యాల జిల్లా అధ్యక్షులు, చిప్పగిరి జడ్పిటిసి విరుపాక్షి**

**ఆలూరు,ఆగస్టు 6,ప్రభాతవార్త :** మడమ తిప్పని మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పంచాయతీరాజ్ వింగ్ అండ్ జోనల్ కర్నూలు,నంద్యాల జిల్లా అధ్యక్షులు,చిప్పగిరి జడ్పిటిసి విరుపాక్షి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొలగవల్లి గ్రామంలో వైఎస్ రాజశేకర్‌రెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీ వివేకానంద ఆశ్రమానికి రూ.25వేలు ట్రస్టు సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు,గ్రామ పెద్దలు తదితరులున్నారు.



# ప్రి(ని)జం ఎక్కడ ..?

(మొదటి పేజీ తరువాయి ) :

**రైతులను నిలువునా ముంచిన ప్రిజం యజమాన్యం:**
రూ.1500కోట్లు పెట్టుబడులతో పరిశ్రమ ఏర్పాటుచేసి, భూములిచ్చిన రైతు బిడ్డల ఉద్యోగ, ఉపాధి కల్పనకు పాటు పడతామన్న ప్రిజం జాన్సన్ లిమిటెడ్ సిమెంటు కంపనీ కల్వటాల, కోటపాడు రైతులను నిలువునా ముంచి, కన్నీటిని మిగిల్చింది. 15ఏళ్ల తర్వాత పరిశ్రమ ఏర్పాటు చేసే ఆర్థిక పరిస్థితిలో సంస్థ లేదంటూ కారణం చెప్పి, భూములన్నీ రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు విక్రయించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. 15సంవత్సరాల క్రితం రూ.2.5, 3లక్షలతో రైతుల నుండి భూములు కొనుగోళు చేసిన ప్రిజం పరిశ్రమ, అటు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకుండా, ఇటు రైతులను సాగుకు అనుమతి ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెట్టింది. సాగుకు అనుమతించాలంటూ అనేక మార్లు రైతులు ధర్నాలు, నిరసనలు చేసినప్పటికీ తమకున్న కార్పోరేట్ పలుకుబడితో రైతులను అణిచి వేసింది. సంస్థ ఉద్యోగులు గ్రామాల్లో పార్టీల నాయకులను వర్గాలుగా విభజిస్తూ, వారికి ఏదో రకంగా ఎరవేసి, రైతుల్లో ఐక్యత లేకుండా విడగొట్టి పబ్బం గడుపుకున్నారు. చివరకు పరిశ్రమ నిర్మాణమే లేకుండా పోవడంతో ఇటు నాయకులు, అటు రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

**ప్రజల సాక్షిగా లిఖిత పూర్వక హామీ ఇచ్చి మోసం:**
భూములు కొనుగోళు చేసిన రెండేళ్లకే పరిశ్రమ నిర్మిస్తామని 2008లో కొనుగోళ్లు ప్రారంభించిన ప్రిజం సంస్థ అటు ప్రభుత్వాలను, ఇటు ప్రజలను మధ్య పెడుతూ, చట్టాల్లో వున్న లొసుగులను ఆసరాగా చేసుకొని 13ఏళ్ల పాటు కాలయాపన చేసింది. 2021లో భూములు కొనుగోళు చేసి చాలాకాలం అవుతుండడంతో అనుమతులు రద్దు అవుతాయన్న ఆలోచనతో మరోసారి ప్రజలను మోసం చేసింది. 2021మార్చి-5న పరిశ్రమ నిర్మిస్తామంటూ మరోసారి పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. అదే వేదికలో సరిగ్గా ఏడాది లోపు అంటే 2022 మార్చి లోపు పరిశ్రమ నిర్మాణ పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చింది. జిల్లా అధికారులు, ప్రజల సాక్షిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి సభా వేదికపైనే లిఖిత పూర్వక హామీ పత్రాన్ని పరిశ్రమ ప్రతినిధులు అందజేశారు. రైతులకిచ్చిన హామీలను, చెప్పిన మాటలను తుంగలో తొక్కిన పరిశ్రమ యజమాన్యం రామ్‌కో పరిశ్రమకు భూముల బదలాయింపుకు సిద్ధం కావడం తీవ్ర ఆక్షేపణీయమని రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

**పోరాటానికి సిద్ధమవుతున్న కల్వటాల రైతులు:**
పరిశ్రమ నిర్మిస్తామని హామీ ఇవ్వడంతోనే తమ భూములను విక్రయించామని, రైతులతో చర్చించకుండా ఇతర పరిశ్రమలకు భూములు విక్రయించరాదని కల్వటాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రిజం భూములను రామ్‌కో పరిశ్రమకు బదలాయిస్తే మొదటగా భూములిచ్చిన రైతుల అభిప్రాయం తీసుకోవాలని కోరుతున్నారు. అన్నదాత నోట్లో మట్టి కొట్టడం ఎంతమాత్రం తగదని, ఈ విషయంలో ఎంత దూరమైనా పోరాటం చేస్తామని కల్వటాల రైతులు పెర్కొంటున్నారు. ఇప్పటికే తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రిలే నిరాహార దీక్షలకు దిగడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. అతి తక్కువ ధరకు భూములిచ్చిన రైతులకు ముందు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పరిశ్రమ నిర్మించక పోతే తమ భూములు తమకు అప్పగించాలని లేదా, అదనపు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఇంత జరుగుతున్నా ఈ విషయం ప్రజా ప్రతినిధులు గానీ, ప్రతి పక్ష నాయకులు ఇప్పటి వరకు స్పందించక పోవడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రజల సమస్యలపై పోరాడటంలో ప్రతిపక్ష పార్టీలే ముందుంటాయి. ప్రిజం భూములు రామ్‌కో పరిశ్రమకు చేతులు మారుతున్నాయంటూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా ప్రతిపక్ష టిడిపి పార్టీ గానీ, కమ్యూనిస్టు పార్టీలు గానీ ఇంత వరకు స్పందించకపోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# టీడీపీ ఉనికి కోసమే.. బాబు పర్యటనలు

( మొదటి పేజీ తరువాయి ) :

అధికారం చేపట్టిన తరువాత ఎస్సార్బీసీ కాలువకు నీరు విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గాలేరు-నగరి రాయల సీమలోని ప్రాజెక్టులను మొదలుపెడితే జల యజ్ఞం, ధనయజ్ఞం అని ఆనాడు చంద్రబాబు నాయుడు పదే పదే అసెంబ్లీలో మాట్లాడడం, ధర్నాలు చేయడం మరచిపోయారా అని ఆయన గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడిని ఆదర్శంగా తీసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా తమ నియోజకవర్గంలో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమయమనం పాటిస్తున్నారని ఆయన తెలిపారు. స్థానిక టీడీపీ నేత ఇలాగే ప్రవర్తిస్తే రాబోయే కాలంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు.

# రైతులు భూ రీ సర్వేకు సహకరించాలి

- ఆర్డీవో వెంకటరెడ్డి



**బనగానపల్లె, ఆగస్టు6, ప్రభాతవార్త:** మండలంలోని రైతులు భూ రీ సర్వేకు సహకరించాలని డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న భూరక్ష రీ సర్వేకు ప్రభుత్వం బనగానపల్లె మండలంలో 8 గ్రామాలు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని మిట్టపల్లె, పండ్లాపురం, బత్తులూరుపాడు, నిలువుగండ్ల, జంబులదిన్నె తదితర గ్రామాలకు ఆదివారం రీ సర్వే హద్దు రాళ్లు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, మండల సర్వేయర్లు ఆతిఫ్, గాయత్రి, వీఆర్వో మధు, గ్రామ సర్వేయర్లు మురళీ, వెంకటేష్ నాయక్, నవ్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కురువ సామాజికి వర్గం రాజకీయ చైతన్యం సాధించాలి



**నంద్యాల విద్య, ఆగష్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కురువ సామాజిక వర్గాన్ని రాజకీయ చైతన్యంతో ముందుకు సాగి సామాజిక, ఆర్థికంగా ఎదగాలని నంద్యాల పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన కైప విజయ్‌కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం కురువ కులజుల ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశానికి కురువ కులజులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మా సామాజిక వర్గాన్ని ఏవరైతే అదుకొని గుర్తించి మనకు సమాజంలో ఆర్థికంగా చేయూతనిచ్చే విధంగా ప్రోత్సహించిన వారికి రాజకీయ లబ్దికి అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో తాత్కాలిక నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్షునిగా కైప విజయ్‌కిరణ్, ఉపాధ్యక్షులుగా బన్నూరు సుబ్బయ్య, కార్యదర్శిగా విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బాలమద్దిలేటి, కోశాధికారిగా సోమశేఖర్, సలహాదారుగా కె వెంకటేశ్వర్లు, కైప హరినాథ్‌బాబు, నాగన్న, కత్తి శంకర్, శ్రీరాములు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు ప్రమాణస్వీకారం చేశారు.

# అగ్నికి అహుతి అయిన కూరగాయల మార్కెట్ బాధితులను అదుకోవాలి

- టిడిపి పోలిట్‌బ్యూరక్ష సభ్యుడు ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల విద్య, ఆగష్టు 6, ప్రభాతవార్త:** నంద్యాలలో వున్న ఫ్రూట్‌మార్కెట్‌లో ఉన్న అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం అదుకోవాలని రాష్ట్ర టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆదివారం అగ్నిప్రమాద బాధితులను కలిసి పరామర్శించారు. టిడిపి 10 వార్డు ఇంచార్జీ గోవిందనాయుడు నష్టపోయిన పండ్ల వ్యాపారస్థులను కలిసి ఎలా జరిగిందంటూ పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ అధికారంలోకి వస్తే కూరగాయల మార్కెట్, ఫ్రూట్ మార్కెట్ రూపురేఖలు మారుస్తామని హామి ఇచ్చారు. నష్టాన్ని అంచనా వేసి అగ్నిప్రమాదం వల్ల తీవ్రంగా నష్టపోయిన వ్యాపారస్థులను మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో జరుగుతున్న పలు అంశాలను బాధితులతో చర్చించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఈప్రభుత్వం బాధితులను పట్టించుకోకపోవడం విశేషమన్నారు. ఈప్రభుత్వం గద్దెదిగేరోజులు దగ్గరలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తక్షణమే అన్నిరకాల సహాయం అందించాలని ఆయన కోరారు.

# రూ.1,00,116లు అన్నదానానికి విరాళం



**పాణ్యం, ఆగష్టు 6, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొత్తూరు సుబ్రమణేశ్వర స్వామి దేవస్థానం అధ్వర్యంలో నిర్వహిస్తున్నఅన్నదాన కార్య క్రమానికి గుంటూరు జిల్లాకు చెందిన సురేష్ దంపతులు రూ.1,00,116లు ఇచ్చినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన సురేష్‌కుమార్ దంపతులు చెక్కును అన్నదాన విరాళానికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి అశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా మార్గంలో స్నేహం



**నంద్యాల టెక్కె, ఆగష్టు 6, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నంద్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పిట్టం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఐఎంఎ అధ్యక్షులు డా.రవికృష్ణ అధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేయి చేయి కలిపి సేవా మార్గంలో నడుద్దామని ప్రమాణం చేశారు. సేవచేసే భాగ్యం లభించడం చాల అదృష్టకరంగా భావిస్తున్నామన్నారు. స్నేహపూరిత వాతావరణంలో లయన్స్‌క్లబ్‌లు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రతివిషయంలో పేదల పట్ల ఉన్న మమకారాన్ని చూపుతూ పేదలకు అన్నిరకాల సేవలను అందించడమే ధ్యేయంగా పరమావధిగా భావిస్తున్నామన్నారు. స్నేహితులందరు పాల్గొని కేక్ కట్‌చేశారు. స్నేహమేరా జీవితం అంటూ ముందుకు సాగుతామని లయన్స్ క్లబ్ అధ్వర్యంలో పేదలకు మరిన్నిసేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ లయన్స్‌క్లబ్ సభ్యులు అంజనేయులు గుప్తా, కార్యదర్శి సోమేసుల నాగరాజు, కొశెట్టి చంద్రశేఖర్, రవిప్రకాష్, బాబురావు, చంద్రమోహన్, రత్నకుమార్, యూసుఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం

**నంద్యాల, ఆగష్టు 6, ప్రభాతవార్త:** ప్రజల నంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం పట్టణంలోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టరు డా.మనజీర్‌జిలాని సమూన్ ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరు హాజరు కావాలని కలెక్టరు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడ యధాతదంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. స్పందన కార్యక్రమంలో గత వారం నుంచి వినూత్న రీతిలో ప్రత్యేక చర్యలు చేపట్టామని ఇందకు అనుగుణంగా అధికారులు వ్యవహారించాలని ఆయన అదేశించారు.

# సెంట్రల్ డిపార్ట్‌మెంట్ పోలీసుల కవాతు



**పత్తికొండ, ఆగస్టు6, ప్రభాతవార్త:** పత్తికొండలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు సెంట్రల్ డిపార్ట్‌మెంట్ పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ టౌన్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో సెంట్రల్ డిపార్ట్‌మెంట్ రూల్స్ ప్రకారం డివిజన్ కేంద్రాలల్లో సెంట్రల్ డిపార్ట్‌మెంట్ పోలీసులు మార్చ్‌ఫాస్ట్, కవాతు నిర్వహించాల్సి ఉందన్నారు. సబ్ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు బ్యాండ్, డ్రమ్స్ వాయిస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్రజలకు, పోలీసుల మధ్య అవగాహన సెంట్రల్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు సబ్‌డివిజన్‌లో నిర్వహించడం జరిగింది.

# క్రైస్తవుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



**పత్తికొండ, ఆగస్టు6, ప్రభాతవార్త:** మణిపూర్‌లో మహిళల పై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు నిరసనగా నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో క్రైస్తవులు, మైనార్టీలు, దళిత సంఘాలు, సీపీఐ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య ,క్రైస్తవులు తిరుపాల్, సుభాష్, ఎంఎస్‌పీ పార్టీ సుభాష్‌చంద్రబోస్‌లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులు, దళితుల పై జరుగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం నివారించాలని దీని పై ప్రధాన మంత్రి నోరుమెదపకపోవడం సిగ్గుచేటని వారన్నారు. మణిపూర్‌లో మహిళల పై అత్యాచారాలు జరుగుతున్నప్పటికి ప్రధాన మంత్రి ప్రకటన చేయకపోవడం వెనుక అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలు మణిపూర్‌లో మహిళల పై దాడులను నివారించడంలో ఘోరంగా విఫలం చెందాయని వారన్నారు. హిందువులు, క్రైస్తవులు మతాల మధ్య ఘర్షణలకు, దాడులను బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పరిపాలన వల్ల దేశవ్యాప్తంగా మతాల, కులాల మధ్య వైర్యం పెరిగియని వారు అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అన్ని మతాలు, కులాల, దళితులు, మైనార్టీల వారు బుద్ధి చెప్పేందుకు సిద్దం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజసాహెబ్, కారన్న, నెట్టేకంటయ్య, క్రైస్తవ నాయకులు ఆనంద్, రాజు, ముద్దరంగడు, సాలరంగడు, యువతీ, యువకులు, సీఎస్ఐ చర్చి, క్యాథలిక్ చర్చి, వివిధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# 21వ రాష్ట్రమహాసభలను విజయవంతము చేయండి

**నంద్యాల, విద్య, ఆగస్టు 6, ప్రభాతవార్త**

ఈనెల 21వ తేదిన తలపెట్టి అంధ్రప్రదేశ్ నాన్‌గజిటెడ్ అషోషియేషన్ వమా సభలను విజయవంతము చేయాలని రాష్ట్ర ఉపాధ్యాక్షులు దస్తగిరిరెడ్డిప్రదానకార్యదర్శి, శివారెడ్డి కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగళరెడ్డి కోరారు. అదివారము స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు అలాగే వారికి సంబంధించిన పిఅర్‌సి ఇతర సమస్యలపై చర్చించడానికి కసి చేస్తామన్నారు ఈసభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోమన్‌రెడ్డి హాజరు అవుతాని చెప్పారు. ఉద్యోగుల పిఅర్‌సిపై ఒక కమిటి వేశారని దానిపై ముఖ్యమంత్ర ఇఈ సభల్లో స్పష్టత ఇస్తారని చెప్పారు కావున ప్రతి నాన్ గజిటెడ్ ఉద్యోగి ఈ సభలకుహాజరుకావాలని కోరారు అనంతరము రాష్ట్ర మహ సభల పోస్టర్లను అవిస్కరించారు.

# ఎఐటియుసి తాలుకా కార్యదర్శిగా ఎం.రాముడు



**కోడుమూరు, ఆగష్టు 6, ప్రభాతవార్త :** కోడుమూరు తాలుకా ఎఐటియుసి కార్యదర్శిగా ఎం.రాముడు, అధ్యక్షుడుగా గడ్డం నాగరాజులు నియమితుల య్యారు. ఆదివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన తాలుకా ఎఐటియుసి కార్యవర్గం ఎంపికకు జిల్లా నాయకులు మునెప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కమ్యూనిష్టుల నాయకులు అంతా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేందుకు దశల వారిగా పోరాటాలు సాగించేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు, దేశంలో కార్మికులకు భద్రత లేదని, కార్మకుల హక్కుల కొరకు, కార్మికుల సమస్యలకు పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దాని అనుబంధ సంస్థల నాయకులు బి.క్రిష్ణ, రాజు, దూళ్లభాస్కర్, మునుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మదర్ మోడల్ స్కూల్ విద్యార్థిని



**అవుకు, ఆగస్టు6, ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని మదర్ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి పూరి చేసుకున్న ఎస్.కె.షబానా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మదర్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు తెలియజేశారు. ఎస్.కె.షబానా 10వ తరగతిలో 582 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో మరియు అవుకు మండలంలో 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎస్.కె.షబానా ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు మరియు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

# మణిపూర్‌లో మహిళల పై దాడులను అరికట్టాలి



**బేతంచెర్ల, ఆగస్టు6, ప్రభాతవార్త:** మణిపూర్‌లో జరుగుతున్న మహిళల పై దాడులు, అత్యాచారయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అరికట్టాలని మండలంలోని క్రైస్తవ సంఘాలు, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు శాంతిర్యాలీని ఆదివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లోని దళిత, క్రైస్తవ మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడుల పై కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జోక్యం చేసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఒక్కమాటైనా మాట్లాకుండా క్రైస్తవులు, దళితుల పై దాడులు చేయించడం హేయమైన చర్యని వెంటనే క్రైస్తవ, దళిత మహిళల పై జరుగుతున్న దాడులను కేంద్రం అరికట్టకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ఫాస్టర్లు హెన్రీ బాబు, పాపారాయుడు, నాయుడు, మేకల నాగరాజు, పలువురు మహిళలు, దళిత సంఘాల నాయకులు, క్రైస్తవ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబు రాక్షస క్రీడపై వైసీపీశ్రేణులు నిరసన

**నంద్యాల క్రైం, ఆగష్టు 6, ప్రభాతవార్త:** పుంగనూరులో తాజాగాచంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రాజెక్టుల సందర్శనపేరుతో రాష్ట్రాన్ని దమడకాండకు నిరసనగా నంద్యాల్లో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలు చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఆదివారం వైసీపీ శ్రేణులు మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీదర్, దృశ్యకలల డైరెక్టరు సునీత అమృతరాజు, బెస్తసంఘం డైరెక్టరు చంద్రశేఖర్‌లు, రిటైర్డు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మైనార్టీ నాయకులు గంజి కరీమ్, మాజీ కౌన్సిలర్ జాకీర్ వుశేన్ పెద్ద ఎత్తున ర్యాలీగా శ్రీనివాస సెంటర్ వరకు వెళ్లారు. అనంతరం అక్కడ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదుట చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వైసీపీ శ్రేణులు మాట్లాడుతూ పోలీసులపై దాడులు చేయడం దారుణమన్నారు. ప్రజారక్షణకు పాటుపడే పోలీసులను అవమానించడం మంచిది కాదన్నారు. టిడిపి నాయకులను పురిగొల్పి తీవ్రంగా దాడిచేసి కొట్టి పోలీస్‌వాహనాలను ధ్వసంచేశారని అందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబువి దుర్మార్గపు రాజకీయాలుఅన్నారు. పుంగనూరులో దహనకాండపై ఆయన దత్తపుత్రుడు ఖండించకుండా వంతపాడుతున్నారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడడం చంద్రబాబుకు తగదన్నారు. రానున్నకాలంలో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్, అబ్దుల్ సలాం, రమణ, సమ్మద్, అమృత్‌రాజు, దేవనగర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

**శ్రీశైలం(ప్రాజెక్టు, ఆగస్టు06, ప్రభాతవార్త**

అధిక శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆదివారంనాడు శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా(సర్కారి సేవగా) జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగానలి మహగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

# వికసించిన విద్యా కుసుమం

- ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్న వెల్దుర్తికి చెందిన బిటెక్ విద్యార్థి..

**వెల్దుర్తి, ఆగస్టు6, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణంలోని అనకలవీధికి చెందిన బెస్త గిరిబాబు, బెస్త చంద్రకళల కుమారుడు బెస్త నితీష్‌కుమార్ బిటెక్(ఇంజనీరింగ్)లో రాణించి శ్రీ విద్యానికేతన్ కళాశాల తిరుపతిలో టాపర్‌గా నిలిచాడు. కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండల కేంద్రంలో వికసించిన విద్యా కుసుమం బెస్త నితీష్‌కుమార్ తల్లి ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలుగా, తండ్రి హోటల్స్‌లో మేనేజర్‌గా కష్టపడి పనిచేస్తూ తన కుమారుడిని తిరుపతిలోని శ్రీ విద్యానికేతన్ కళాశాలలో బిటెక్ (ఇంజనీరింగ్) పూర్తి చేయించారు. తల్లితండ్రుల కష్టానికి ప్రతిఫలంగా కళాశాల టాపర్‌గా నిలిచి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ,శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల నిర్వాహకులు మంచు మోహన్‌బాబు, మంచు విష్ణుల ఆధ్వర్యంలో అవార్డు, ప్రశంసాపత్రం(గోల్డ్‌మెడల్)ను అందుకున్నాడు. తమ కుమారుడు టాపర్‌గా నిలిచి ఇలా అవార్డు అందుకోవడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బెస్తనితీష్‌కుమార్‌కు అవార్డులు రావడం పట్ల వెల్దుర్తిలోని గిరిబాబు కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించి ఆ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

# పత్తికొండ ఎమ్మెల్యే సహాకారంతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నాం

- మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి

**వెల్దుర్తి, ఆగస్టు6, ప్రభాతవార్త :** పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి సహాకారంతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటి ఉచిత కొళాయిలను ఆయన వైకాపా నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తాము తమ కాలనీలో కొళాయిలు, రోడ్లు, మురికికాల్వలు కావాలని గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు అడిగినను వేయలేదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ఎమ్మెల్యే శ్రీదేవికి, బొమ్మనరవిరెడ్డికి అడిగామన్నారు. వారు స్పందించి అభివృద్ధి పనులు చేయించారన్నారు. తాము ఎమ్మెల్యే శ్రీదేవి, రవిరెడ్డికి రుణపడి ఉంటామన్నారు. జగనన్న ప్రభుత్వంలో అందరికి మంచి జరుగుతుందని రవిరెడ్డి ప్రజలతో అన్నారు. మీరు వైకాపా ప్రభుత్వానికి పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవికి మీ మద్దతు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వెంకటనాయుడు, జి.యస్.ఆరిఫ్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ

-మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేడం సుబ్బరాయుడు

**బనగానపల్లె, ఆగస్టు6, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేడం సుబ్బరాయుడు తెలిపారు. మణిపూర్‌లో మహిళల పై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా పట్టణంలో ఉదయం 10 గంటలకు అవుకు మెట్ట నుంచి శాంతిర్యాలీ మొదలవుతుందని అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శాంతిర్యాలీలో క్రైస్తవులు, ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేడం సుబ్బరాయుడు కోరారు.

# రావణాసుడి పాలనను తలపిస్తున్న వైసిపి పాలన



**కోవెలకుంట్ల, అగస్టు 6, ప్రభాతవార్త :** ఒక్క ఛాన్సు పేరుతో అదికారము చేపట్టిన వైయస్ఆర్ పార్టి అద్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పాలన రావనాసుడి పాలనను తలపిస్తుందని తెలుగు దేశం పార్టి రాష్ట్ర కార్యదర్శి గడ్డంరామకృష్ణారెడ్డి అన్నారు. అదివారము స్థానిక తెలుగు దేశం పార్టి కార్యాలయంలో అయన విలేకర్లతో మాట్లాడుతూనాడు రామాయణము రావణాసుడు ఎంత విర్రవీగి పోయాడో అదే తరహాలో నేడు జగన్‌మోహన్‌రెడ్డి విర్రవీగుతున్నాడని చెప్పాడు. అయితే నాడు రావణాసుడు ఎలా పతము అయ్యాడో నేడు జగన్ కూడా అలాగే పతనముకావడానికి సిద్దము అయ్యాడని చెప్పారు. అలాగే పురాణంలో శ్రీమహ విష్ణువు బసమాసుడిని తన నొత్తిన తానే చెయ్య పెట్టుకునే విదము చేశాడు ఈ నాడు జగన్ కూడా ప్రజలు ఇచ్చిన దానిని కాపాడుకోలేక తన నొత్తిన తానే చేయ్యిపెట్టుకుని పతనము కావడానికి అన్ని దారులు తెరుచుకున్నాయని జోష్యము చెప్పారు. ముఖ్యంగా నాడు తన తండ్రి చేసిన పుణ్యమో లేక దేవుడు అనుకూలించాడో తెలియదు కాని ప్రజలు 151సీట్లు ఇచ్చారు కాని దానిని కాపాడుకోకుండా రాక్షస పాలన చేస్తున్నాడని అరోపించారు. రైతుల వినాషమును కోరుకున్న ఏ నాయకుడు ఈ లోకములో బాగుపడిన దాఖలాలు లేవన్నారు. రైతు సుభీక్షంగా ఉంటే రాజ్యం బాగుటుందని పురాణాలు చెబుతున్నాయని చెప్పారు. అన్నపెట్టే రైతున్నల గోశ ఈ జగన్‌కు శాపమై దహిస్తుందని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు అయన తండ్రి చేపట్టిన ప్రాజెక్టులను నాశనము చేస్తుంటే దానికి అడ్డుకోవడానికి బయలు దేరి ప్రతిపక్షనాయకుడు, సీనియర్ నాయకుడైన బాబును అడ్డుకుని అయనపై రాళ్ల విసరము చాలా బాదాకరమని అన్నారు. నాయకులు శాశ్వతము కాదు మీరు చేసే ఉద్యోగము 62సంవత్సరాలు గ్యారంటీ దానికి కాపాడుకోవాలని కాని ఒక రాజకీయ నాయుడికి చంచాగిరి చెయ్యడము మంచిదికాదన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత పెరిగి చదువులో రాణిస్తారు...

: ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ వెల్లడి.

**కర్నూలు ఆగస్టు 6.ప్రభాతవార్త :**



విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణించే అవకాశం ఉంటుందని ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు .కర్నూల్ నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో తైక్వాండో సీనియర్ శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తై క్వాండో ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ చిన్నారి క్రీడాకారులకు రోజు స్వచ్ఛమైన మంచినీరు తాగేందుకు వీలుగా వాటర్ బాటిళ్ల ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన కరాటే విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో , చదువులో రాణించాలంటే మెరుగైన ఆరోగ్యం ఉండాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులు బయట ఆహార పదార్థాలను తినకుండా ఇంటిలో చేసిన ఆహార పదార్థాలను మాత్రమే తినాలని సూచించారు. అలాగే కలుషితమైన నీరు తాగడం వల్ల కలరా, గ్యాస్ట్రోఎంట్రైటిస్, డయేరియా, టైఫాయిడ్ ,హెపటైటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్య మెరుగుపడి చదువులో రాణిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల కులాలు, మతాలు, ప్రాంతాలు అన్న భావాలు ఉండమని అందరూ స్నేహభావంతో మెలిగి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తారని చెప్పారు. దేశ భవిష్యత్తు నేటి చిన్నారుల చేతుల్లోనే ఉందని ,వారు క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు తో పాటు రోహిత్, నాగరాజు, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను రెచ్చగొట్టేందుకే చంద్రబాబు రూట్‌మ్యాప్ అతిక్రమణ-ఎమ్మెల్యే



**నందికొట్కూరు,ఆగష్టు 6,ప్రభాతవార్త:** ప్రాజెక్టుల పరిశీలన అంటు పర్యటన చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రజలను రెచ్చకొట్టేందుకే రూట్‌మ్యాప్ అతిక్రమించి పుంగనూరులోకి ప్రవేశించేందుకు చూడడం వలనే సంఘటనకు కారకుడయ్యాడని నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. ఆదివారం స్తానిక పార్టీ కార్యాలయం నుండి డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాం వరకు ర్యాలీ నిర్వహించి చంద్రబాబుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళీలు అర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతు డా.బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరంగా అందరికి హాక్కులు ఉన్నాయని శాంతియుతంగా ఎవరికి ఇబ్బంది కలుగకుండా చూడల్సిన భాధ్యత ప్రజా ప్రతినిధులుగా మనకు ఉందని అయితే వాటిని అతిక్రమించే హాక్కు ఎవరికి లేదని, జిల్లాలో ముఖ్యమంత్రి, బానకచెర్ల పర్యటనకు వచ్చిన సమయంలో కూడ ప్రజలను రెచ్చకొట్టేలా మాట్లాడడం జరిగిందన్నారు. 40 ఏళ్ళ రాజకీయ చరిత్ర, 14 ఏళ్ళుగా సి.యం.గా పనిచేసిన చంద్రబాబు రూట్‌మ్యాప్ అతిక్రమించ కూడదని తెలియదా, తమిళనాడు, బెంగుళూరు ప్రాంతాల నుండి ముందస్తు గుండాలలను రప్పించి ప్రణాళిక ప్రకారం కత్తులు, కర్రలు, తుపాకులు వాహానాలలో వేసుకొని పుంగనూరులోకి అనుమతి లేకున్న వెళ్ళేందుకు ఆయన ప్రయత్నించడం వలనే ఘర్షణకు చంద్రబాబు కారకుడయ్యాడని, టిడిపి నాయకులు, కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్న పోలీసుల మీద రాళ్ళదాడి చేయడం వలన డి.యస్పీ, సి.ఐ. ఎస్పైలతో దాదాపు 26 మంది పోలీసులకు తీవ్రగాయాలు అయ్యాయని దీనిని ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రతిపక్షాలు కుట్రలుపన్నాయని ఆయన విమర్శించారు. పోలీసు వ్యవస్థ ఉన్నది ప్రజా రక్షణ కొరకేనని వారికి రాజకీయ రంగు పులమడం మంచిదికాదని, చంద్రబాబు కుట్రరాజకీయాలతో రాష్ట్రంలో అసాంతి సృష్టించేందుకు పుంగనూరును పావుగా వాడుకున్నాడని అయన ఘాటుగా విమర్శించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పంధించి చంద్రబాబుతో సహ కారకులైన వారందరిపై కేసుల నమోదు చేయాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహానిర్మాణ సంస్థ డైరెక్టర్ రమాదేవి, రాష్ట్ర ఉర్దు అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ సుకూర్‌మియ్య, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉశేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్లా రబ్బానీ, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, కౌన్సిలర్లు జాకీర్‌హుశ్శేన్, ధర్మారెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్‌రాజ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విభాగం అధ్యక్షులు సగినేల వెంకటరమణ, వివిధ మండలాల నాయకులు జంగాల పెద్దన్న, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, నెమలి రమణారెడ్డి, కొణిదేల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మారునీళ్ల చెలిమ వద్ద షత్సల తీర్థమఠస్వామి 21రోజుల మౌనదీక్ష

- స్థానిక కర్నాటక భక్తులచే క్షేత్రం కిటకిట
- 7న లోకకళ్యాణం హోమంకు భక్తులు తరలిరండి
- 8న శంభో సోమనాథ శివచార్యుల మౌనదీక్ష విరమణ



**బనగానపల్లె,ఆగస్టు6, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్ర సమీపంలో వెలసిన మారునీళ్ల చెలిమ యజ్ఞ యాగాదులు భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంది.కర్నాటకలోని రాయచూర్ జిల్లా సుల్లానపుర శ్రీ షత్సల తీర్థమట్ శంభో సోమనాథ శివచార్యులు 21రోజుల మౌనదీక్ష పాటిస్తూ మారునీళ్ల చెలిమ క్షేత్రంలో తన శిష్యబృందంచే లోకకళ్యాణ హోమాలు చేస్తుండడంతో ఈ ప్రాంతం కర్నాటక ప్రాంత భక్తులచే కిటకిటలాడుతుంది.అధిక శ్రావణంలో మౌన అనుష్టాన,ప్రతిరోజు యజ్ఞయాగాదులు చేయడం వల్ల లోకకళ్యాణం హితం చేకూరుతుందన్న సంకల్పంతో సోమనాథ శివచార్యులు కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా సోమనాథ శివచార్యుల శిష్యబృందం మాట్లాడుతూ కర్నాటకలో షత్సల తీర్థమఠం పీఠాధిపతి శ్రీ సోమనాథ శివచార్యులు మౌనదీక్ష చేపట్టదలచి అందుకు తగిన ప్రాంతం కోసం అన్వేషించగ అందుకు యాగంటి సమీపంలోని మారునీళ్ల చెలిమ సరైందని ఇక్కడ మౌనదీక్ష చేపట్టినట్లు తెలిపారు.అంతేకాక మారునీళ్ల చెలిమలో భక్తుల పూజలు అందుకుంటున్న శివలింగం అత్యంత పురాతనమైందని ఇక్కడ లింగాకారంలో ఉన్న శివలింగం దేశంలోని 12 ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఎక్కడాలేదని ఈ కారణంగా ఈ క్షేత్రం ఎంతో మహిమాన్విత క్షేత్రంగా వెలుగుతుందని వారన్నారు.క్షేత్రానికి ఉన్న ప్రాశస్తి కారణంగా గురుదేవులు శ్రీ శంభో సోమనాథ శివచార్యులు 21రోజులపాటు మౌనదీక్ష ప్రతిరోజు యజ్ఞయాగాదులు చేపట్టి లోకకళ్యాణం కోసం పాటుపడుతున్నారని అన్నారు.ఈనెల 7వ తేదిన చేపట్టే యజ్ఞంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని యజ్ఞ ఫలితాలను పొందిన తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు అన్నారు.8వ తేదిన స్వామి శంభోశంకర మౌనదీక్ష విరమణ చేపడతారని ప్రతిఒక్కరు ఈ మహత్కార్యంలో పాల్గొనాలని శిష్యబృందం కోరింది.

## చంద్రబాబు నీచ రాజకీయాలు మానుకోవాలి..!

- ప్రజల సానుభూతి కోసం రెచ్చగొట్టే మాటల మానుకోవాలి..
- బాబు ఊసరివెల్లి కబుర్లను జనం నమ్మరు.. - పత్తికొండ ఎమ్మెల్యే



**తుగ్గలి,ఆగస్టు 6,ప్రభాతవార్త**

తెదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలు మానుకోవాలని లేనిచో రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు శాశ్వత రాజకీయ సమాధి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఆద్వర్యంలో వైసిపి నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను ఊరేగించి చెప్పులతో కొట్టి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టు సందర్శన పేరుతో రాష్ట్రంలో చంద్రబాబు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండంతో పాటు పుంగనూరులో చంద్రబాబు కార్యకర్తలను రెచ్చగొట్టి టిడిపి కార్యకర్తలచే పోలీసులపై చేయించినదాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. పోలీసులపై దాడి చేయడం అమానుష చర్య అని అన్నారు. పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడికి ఉసిగొల్పడం,పోలీసుల వాహానాలను ధ్వంసం చేసి తగలబెట్టడం ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ అన్నారు. చంద్రబాబు నోటికి అడ్డుఅదుపు లేకుండా మాట్లాడుతూ ప్రజల్లో సానుభూతి పొందాలనే ఉద్దేశ్యంతో సిఎం జగనన్న ప్రభుత్వంపై ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటివి మానుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య,సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతు,మండల కన్వినర్ జిట్టా నాగేష్,మాజీ జడ్‌పిటిసి జగన్నాథ్,రాతన మోహాన్‌రెడ్డి,వక్ఫ్‌బోర్డు చైర్మన్ హుస్సేన్,కోఆప్షన్ మెంబర్ చాంద్‌భాషా, రామకొండ సుధాకర్‌రెడ్డి,రాంపల్లి నాగభూషణంరెడ్డి,భూపాల్‌రెడ్డి, రామలింగయ్య, పల్లె నాగిరెడ్డి,గుంత రఘు, సోమశేఖర్‌రెడ్డి, దివాకర్, సుధాకర్, చెన్నంపల్లి సుభాన్,లాల్‌రెడ్డి,శేఖర్‌రెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

## మణిపూర్ ఘటనలో ప్రధాని మౌనం వెనుక ఎన్నో రహాస్యాలు




**నంద్యాల విద్య, ఆగస్టు 6, ప్రభాతవార్తః** ప్రజలను మభ్యపెట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందువరసలో ఉన్నాయని మణిపూర్ ఘటనలో ప్రధాని మౌనంవహించడం వెనుక ఎన్నో రహాస్యాలు దాగి ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహాన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు దాసరి చింతలయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మం త్రిని చేసుకోవడం ద్వారా రా ష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజిని అమలు చేస్తామని హామి ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.3 లక్షల రుణమాఫీ, మహిళా సాధికారక కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు అర్థికంగా చేయూతనిస్తామన్నారు. మతోన్మాద దమనకాండను ఖండించి ప్రశ్నించి రూపుమాపే బాధ్యత కేంద్రప్రభుత్వానికి ఉందని వారు పట్టించుకోకపోవడం విచారకరమనా న్నరు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ అని ప్రతి వ్యక్తి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని రాష్ట్రంలో దేశంలో అధికారంలోకి రావాలని అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్యతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, జయలక్ష్మీ, కోశాధికారి ఎస్‌వైడి ప్రసాద్,చాబోలు సలాం, రఫీ, బాలకృష్ణ,చాంద్‌బాష, మహిళా నాయకులు, ప్రియ, సునీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షల వ్యయంతో సిసిరోడ్డు ప్రారంభం

- దశలవారిగా వార్డుల అభివృద్ధి : ఎమ్మెల్యే శిల్పా

**నంద్యాల క్రైం, ఆగస్టు 6, ప్రభాతవార్తః** పట్టణంలోని 8వ వార్డు తోటలైన్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాతో కలిసి రోడ్లను ప్రారంభించారు. వార్డు పర్యటనలో స్థానిక సమస్యలను గుర్తించి వాటినిపరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.అన్ని వార్డుల్లో అభివృద్ధి చేపడుతున్నామని దశలవారిగా వార్డులను అభివృద్ధిచేస్తామని ఎమ్మెల్యేహామి ఇచ్చారు. సమస్యలతోకూడిన వార్డులలో త్వరలో వాటిని పరిష్కారంకోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీదర్, పాంషావలి, కౌన్సిలర్లు తోహిద్, వార్డు ఇంచార్జ్ పఠాన్ నిజామాఖాన్, మున్సిపల్ కమిషనరు రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల్లోకి వెళ్లే ముందు ఎలా మాట్లాడాల్లో నేర్చుకొని మాట్లాడాలి

- రెచ్చగొట్టే దొరణి ప్రజా స్వామ్యం కాదు ..
- చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- బాబు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వైసీపీ శ్రేణులు



**కోడుమూరు,ఆగష్టు 6, ప్రభాతవార్త ః** ప్రజల్లోకి వెళ్లే ముందు ఎలా మాట్లాడాల్లో నేర్చుకొని మాట్లాడాలని తెలుగు దేశం అధినేత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హితవుపలికారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆదివారం పుంగనూరులో జరిగిన సంఘటనపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబు చేసిన ప్రసంగాలను తీవ్ర స్థాయిలో ఖండించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రా ష్ట్రంలో చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న పర్యటనలల్లో అధికార పార్టీపైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసమర్థపు ఆరోపణలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారు. ఒక వైపు వయోభారం, మరోవైపు ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ బాబు ఆవేశంతో ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. ఇదే ఆవేశాలతో తనయుడు లోకేష్,దత్తపుత్రుడు కూడా జగనన్నపై లేని పోని విమర్శలు, ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రసంగాల వల్ల తమ కార్యకర్తలు రెచ్చిపోయే పరిస్థితులు ఏర్పడుతాయని, అంతే గాక ప్రజలను తప్పుదోవ పెట్టే ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎక్కడైనా వెళ్లొచ్చు కానీ ప్రజల ముందు మాత్రం ప్రజాకర్షణల కోసం తమ ప్రభుత్వాన్ని కించపర్చినా సహించేది లేదన్నారు. మొన్న పుంగనూరులో జరిగిన సంఘటనలో బాబు మాట తీరు వల్లే కార్యకర్తల మధ్య యుద్ద వాతావర ్ణం ఏర్పడిందన్నారు. ఎన్నికలు వస్తున్నాయి ., కాబట్టి ప్రజల ముంగిట ప్రతిపక్ష నాయకుడు ఏ విధంగా మాట్లాడాలో నేర్చుకోవాలన్నారు. గత ఎనిమిది నెలల నుంచి బాబు నిర్వహిస్తున్న పబ్లిక్ మీటింగులలో తమ పార్టీపై చేస్తున్న విమర్శలకు ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఆయా ప్రాంతాలల్లో ఇప్పటి వరకు బాబు పర్యటనలన్నీ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంతోనే అల్లర్లు జరుగుతున్నాయని, బాబు ఎక్కడకు వెళ్లినా అక్కడ జరుగుతున్న సంఘటనల వల్ల ప్రజలకు ప్రశాంత వాతవర్ణంకు తీవ్రంగా ఆటంకం ఏర్పడుతుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కావాలంటే గతంలో బాబు చేసిన అభివృద్ధి పనులు ఎవైనా ఉంటే వాటి గురించి మాట్లాడి ప్రజలను ఆకర్షితులను చేసుకోవాలని కానీ ప్రతి సమావేశంలో జగనన్నను తిట్టడమే పనిగా పెట్టుకున్నా బాబు మాటాలు ప్రజల వినేస్థితిలో లేరన్నారు. అంతేగాక వెన్నుపోటు రాజకీయాల గురించి కూడా ప్రకటనలు చేస్తున్న బాబుకు ఆ తరహారాజకీయాలు తమనేతలకు లేవని చెప్పుకొచ్చారు. సొంత మామ అయిన ఎన్‌టిఆర్‌కే వెన్నుపోటు రాజకీయాలు చేసి అధికారంలో వచ్చిన బాబుకు స్వంతంగా రాజకీయాలను ఎదుర్కొని ప్రజల్లోకి వెళ్లే ధైర్యం కొల్పోయారని ఆరోపించారు. బాబు కుట్ర రాజకీయాలతోనే బాబే ఎన్టీఆర్‌ను చనిపోయేలా మానసిక క్షోభకు గురిచేశారన్నారు. వైనాట్ 175 తమ లక్ష్యమని,ఆ లక్ష్యసాధన కోసమే తమ నేత జగనన్న పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ఈ ఎన్నికలే చివరిగా నిలుస్తు న్నాయని, అందుకే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రసంగాలు చేసినా ఫలితం లేదని, వచ్చే ఎన్నికల్లో కూడా వైకాపా ప్రభుత్వమే విజయం సాధించడం ఖాయమన్నారు.

**బాబు దిష్టిబొమ్మదగ్ధం ః** మొన్న జరిగిన పుంగనూరు సంఘటనకు నిరసనగా కోడుమూరులో అంబేద్కర్ విగ్రహం దగ్గర కోడుమూరు వైసీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ దగ్ధం చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు అద్దుగుల రాజశేఖర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి, ప్యాలకుర్తి విజయయాదవ్, ప్రతాపరెడ్డి,లాయర్ ప్రభాకర్, ఏకాంబరం, వెంకటేశ్వర్లు,దయాకర్,అయ్యప్ప,చంద్రశేఖరరెడ్డి ,కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాతో పాటు మనకు ఎన్నికలు రావచ్చు

- టిడిపి ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి



**నందికొట్కూరు,ఆగష్టు 6,ప్రభాతవార్త:** గత వారం రోజులుగా వస్తున్న సమాచారం మేరకు తెలంగాణాతో పాటు మనకు కూడ ఎన్నికలు వస్తాయనే సమాచారం మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి పార్టీ విజయానికి కృషిచేయాలని నందికొట్కూరు టిడిపి ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అల్లూర గ్రామంలో నందికొట్కూరు నియోజకవర్గం క్లస్టర్ కో-ఆర్డినేటర్లు మరియు యూనిట్ ఇన్‌చార్జ్‌లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఓటర్ వెరిఫికేషన్, మాపింగ్ కార్యక్రమాలు త్వరగా పూర్తి చేయాలని, బూత్ లెవెల్ నుంచి మెజార్టీ వచ్చేలా పర్యవేక్షించాలని, అలాగే ఓటర్లుగా చేర్పించే సమయంలో చాల జాగ్రత్తలు పాటించాలన్నారు. వైకాపా నాయకులు దొంగ ఓట్లు చేర్పించడం, లేదా డబ్బు, ధౌర్జన్యం దీనిపైనే వార ఆధారపడ్డారని ఆయన తెలిపారు. ఇటీవలే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు దేవళ్ళ మురళి, వివిధ మండలాలకు చెందిన కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్న చంద్రబాబు

- 40 ఇయర్స్ ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబుకు ఇది తగునా?
- పోలీసులపై దాడిచేయడం అమానుషం : ఎమ్మెల్యే శిల్పా



**నంద్యాల క్రైం, ఆగష్టు 6, ప్రభాతవార్తః** రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్నారని అధికార దాహంతో దుర్మార్గపు అలోచనలతో రక్తపాతం సృష్టిస్తున్నారన్నారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహాంలో పుంగనూరులో చంద్రబాబు నాయుడు దాడి ఘటనపై ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇసాక్ బాషతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా రక్షణ కల్పించే పోలీసులపై దాడులకు తెగబడి దారుణంగా కొట్టించి గాయపరిచారని ఆయన తీవ్రంగా ఖండించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన చంద్రబాబుతో సహా దాడుల్లో పాల్గొన్న ప్రతిఒక్కరిపై కేసులునమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అనిచెప్పుకునే చంద్రబాబు రాష్ట్రాన్ని అబాసుపాలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. చంద్రబాబు చేస్తున్న దుర్మార్గపు కుట్రపూరిత అలోచనలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజారక్షణకు పాటుపడే పోలీసులపై రెచ్చగొట్టె విధంగా వ్యాఖ్యాలు చేస్తు టిడిపి నాయకులకు దాడులకు పురిగొల్పడం అత్యంత దారుణమైన హేయమైన చర్య అన్నారు. చంద్రబాబు పర్యటన రూటు మ్యాప్ మార్చుకొని వ్యూహాత్మకంగా పుంగనూరులో సభ నిర్వహించి పెద్దిరామచంద్రారెడ్డిపై అనుచితంగా రెచ్చగొట్టె వ్యాఖ్యాలను కార్యకర్తలను, రెచ్చగొట్టడం దుర్మార్గమైనచర్యలు అన్నారు. టిడిపి గుండాలు రెచ్చిపోయి మారణాయుదాలతో పోలీసులపై దాడి, వాహానాలను ధ్వంసం చేయడం, రాక్షసక్రీడ అన్నారు. ఇలా బరితెగించి దాడులుచేస్తున్న తీరు చుస్తుంటే పోలీసు వ్యవస్థ అప్రతిష్టపాలవుతుందని అందోళన వ్యక్తం చేశారు. పోలీసుల మీద దాడిచేయడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పరకాష్ట అన్నారు. టిడిపి కార్యకర్తలు పదే పదే దాడులు చేస్తుంటే మా నాయకులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శాంతి భద్రతలకు విఘాగతం కలగకుండా ప్రశాంతంగా సహనంతో ఉండాలని చెప్పారు. మానాయకుడు ఒక్కసారి సైగచేస్తే టిడిపి నాయకుల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. గత కొద్దికాలంలో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు కులాల మధ్య చిచ్చుపెడుతూ అనుచిత వ్యాఖ్యాలు, వాలంటీర్లపై నిందలు మోపడం జరిగిందన్నారు.చంద్రబాబు రాయలసీమ వాసి అయితే రాయలసీమకు ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారో ఎంత అభివృద్ధి చేశారో సూటిగా చెప్పాలన్నారు. రాయలసీమ రాజధాని కావాలని కోరుతుంటే చంద్రబాబు అమరావతి రాజధాని కావాలని కోరడం ఎంతవరకు సమంజసం అన్నారు. రాయలసీమపై ఉన్న కపటప్రేమ చంద్రబాబు వ్యాఖ్యాలతో బయట పడ్డాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ పవర్ ఎంటో చూపించాలనికోరారు. చంద్రబాబు మతిస్థిమితం లేక వ్యవహారిస్తున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులపై దాడిచేయడం అమానుష చర్య అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టరు సునీత అమృత రాజ్, వైస్‌చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, వైసీపీ కౌన్సిలర్లు, బెస్తసంఘం డైరెక్టరు చంద్రశేఖర్, కో-అప్షన్ సభ్యులు సలాముల్లా, అబ్దుల్‌కలాం, పిల్లి కిరణ్, సోమశేఖర్‌రెడ్డి, పండు తదితరులు పాల్గొన్నారు.

## కొలనుభారతిని దర్శించుకున్న జేడి



**కొత్తపల్లి,ఆగష్టు 6,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా అగ్రికల్చరర్ జేడి మోహాన్‌రావు ఆదివారం కొలనుభారతి అమ్మవారిని దర్శించుకొని అర్చనలు చేశారు. జేడికి ఆలయ పురోహితులు సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అనంతరం శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రైతులు సొసైటీ ఋణాలను వినియోగించుకోవాలి

- ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి



**కల్లుదేవకుంట(మంత్రాలయం), ఆగస్టు 6, ప్రభాతవార్త:** మండలంలోని రైతులు ప్రభుత్వం అందించే సొసైటీ ఋణాలను వినియోగించుకోవాలని ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని కల్లుదేవకుంట సొసైటీ ఛైర్మెన్‌గా రఘునాథరెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గతంలో బ్యాంకుల్లో ప్రభుత్వం రైతుల ఋణాలను మాఫీ చేసిందాన్నారు.అయితే సొసైటీ రైతుల ఋణాలను మాత్రం ప్రభుత్వం మాఫీ చేయలేదన్నారు.కావున ఋణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.కల్లుదేవకుంట గ్రామానికి సొసైటీని మంజూరు చేయించిన ఘనత రాఘవరెడ్డికే దక్కుతుందన్నారు.అంతకుమందు బాలనాగిరెడ్డికి,సీతారామిరెడ్డి కి బాణసంచా కాల్చుతూ ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి,వైసిపి యువజన నాయకులు విఖ్యాత్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మెన్ రఘునాథ్‌రెడ్డి,సిఈఓ వెంకటేశ్వర్లు,సూపర్‌వైజర్ గౌడ్,సిఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బిసి



**బనగానపల్లె రూరల్, ఆగష్టు 6, ప్రభాతవార్తః** బనగానపల్లె మండలంలోని రామతీర్థం గ్రామంలో ఆదివారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి ఆయన సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బిసి ఇందిరారెడ్డిలు టిడిపి నాయకులతో కలిసి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమాన్నినిర్వహించారు. ఇటీవల జరిగిన మహానాడులో నారాచంద్రబాబు నాయుడు విడుదల చేసి మీనిమేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి అక్కడి ప్రజలకు అందజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు నష్టం జరిగిందన్నారు. నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసి చార్జీలు, పెంచడమే కాకుండా నిరుద్యోగ యువతకు ప్రతియేట జనవరిలో జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తాని జాబ్‌లెస్ క్యాలెండర్‌గా చేసిన ఘనత జగన్‌మోహాన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదేవిధంగా గత టిడిపిప్రభుత ్వంలో నిరుద్యోగ యువత కోసం నెలకు రూ.2 వేలు నిరుద్యోగభృతి ఇవ్వడం జరిగిందని నేడు అదికూడలేకుండా చేశారన్నారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే జగన్‌మోహాన్‌రెడ్డి నేడు రైతులకు పంట ఇన్‌ఫుట్ సబ్సిడి, పంట గిట్టుబాటు ధర కూడ ఇవ్వలేకపోయారు. రైతుల మోటర్లుకు మీటర్లు బిగిస్తు రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. మద్యపానాన్ని దశలవారిగా తగ్గంచి కేవలం ఫైస్టార్, త్రీస్టార్ హోటల్స్‌కే పరిమితం చేస్తామని చెప్పిన జగన్ నేడు అనేకషాపులను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా మహిళలకు అమ్మఒడి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికిఇస్తానని చెప్పి నిబంధనల పేరుతో ఒకరికే ఇవ్వడం జరుగుతుందన్నారు. దానిలో స్కూల్ అభివృద్ధి రెండువేలు కట్ చేసి రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన మహానాడు సభలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మీనిమేనిఫెసో ్ట విడుదల చేయడం జరిగిందన్నారు. అందులో ప్రతిరైతన్నకు అన్నదాత పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.1500లు చొప్పున ఇస్తామన్నారు. తల్లికివందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదువుకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. యువగళం నిధి పథకం ద్వారా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతికి నెలకు 3 వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ప్రతియేట మూడు గ్యాస్‌సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందనానరు. ఇంటిటికి కొళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు ఆర్టీసి ఉచిత ప్రయాణం చేస్తామన్నారు. మన చంద్రన్న విడుదల చేసిన పథకాల్లో నిబంధనలు, వివక్ష ఉండదని మాజీ ఎమ్మెల్యే భరసా ఇచా ్చరు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.